



# వంశీకృష్ణ 25th ఫ్రేమ్

## శుభం తరువాత





# 25TH FRAME SHUBHAM CARD

**Cinema essays**

by **Vamsheekrishna**
**vamsykrishna8@gmail.com**
Mobile: 94919 59062

© Writer

First Edition : August 2017

Cover Design : Brahmam Bhavana Graphix
Hyderabad@9848254745

For Copies : Palapitta Books
# 16-11-20/6/1/1
# 403, Vijayasai Residency
Saleem Nagar, Malakpet
Hyderabad - 500 036
PH: 040-2767 8430
palapittabooks@gmail.com

Printed at : Karshak Printers
Vidyanagar
Hyderabad

Price : Rs. **150**

# వ్యాసక్రమం


1. స్థల కాల స్పృహ వున్న నటుడు ........ 23
2. వెన్నెల రాత్రులు వేసవి మల్లెలు వేటూరి పాటలు... ........ 28
3. ఓ ఆదర్శ నమూనా పట్వర్ధన్ వీడియో చిత్రం ........ 35
4. తెలుగు సినిమా - ఒక డెజావూ! ........ 40
5. కేరక్టరైజేషన్ లేదా పాత్ర చిత్రణ ........ 45
6. ఆ రెండు సినిమాలు - ఒకటే! ........ 50
7. మునెమ్మను సినిమాగా తీస్తారా? ........ 56
8. మన అవార్డు సినిమా ........ 62
9. గుండె కింద తడి లేని తెలుగు సినిమా ........ 68
10. పదేళ్ల తెలుగు సినిమా వెలుగునీడలు ........ 73
11. మన సినిమాల్లో మహిళా చైతన్యం ఏది? ........ 80
12. గోరంత నివాళి ........ 86
13. మాటలంటే మాటలు కాదు...! ........ 91
14. ఈ పాటలకి అర్థం చెప్పండి ప్లీజ్... ........ 96
15. మారుతున్న సినిమా ప్రేమలు.. ........ 103
16. జీవితంపై ఆశని పెంచే సినిమాలు.. ........ 110
17. ఈ ఖాళీని ఎవరు పూరిస్తారు? ........ 116
18. ఈ దూకుడు ఎందాకా...? ........ 120
19. "ఓ గంగా బెహతహై క్యోం?" ........ 125
20. తీరుమారని తెలుగు సినిమా - 2011 ........ 131
21. జీవితం ఒక ప్రయాణం ........ 137
22. తెలుగు స్త్రీ సినిమా ఎప్పుడు? ........ 142
23. రూపం సరే...! సారం మాటేమిటి? ........ 146
24. మన పిల్లలు ఇలాగే ఉంటున్నారా? ........ 152
25. చూసీ చూడలేని సినిమాలు - రెండు ........ 156

26. కాకా... ఉయ్ మిస్ యూ...! ............................................... 160
27. సినిమా విజయం – కొన్ని ఆలోచనలు ........................................ 164
28. బ్రాండ్ అంబాసిడర్ 'జులాయి'! ................................................ 168
29. ప్రేమకు అర్థాన్ని వెతికిన 'బర్ఫీ' ................................................ 173
30. మన అవార్డులు – మన ప్రమాణాలు .............................................. 178
31. 2012 తెలుగు సినిమా మెరుపులు మరకలు ................................. 182
32. నాన్నా... నీకు సినిమా చూడటం తెలీదు! ....................................... 188
33. అతని మరణం ఒక కామా మాత్రమేనా...? ...................................... 192
34. ముచ్చటైన జంట ........................................................................ 198
35. మిథునం గురించి మరో సారి ......................................................... 201
36. ఈ పాటకి అర్థారిల్లేది? ................................................................ 208
37. ఇప్పుడు మనవి రాతి మోహాలు, మొరటు ఊహలు ............................. 215



# వెన్నెల రాత్రులు వేసవి మల్లెలు వేటూరి పాటలు

"ఏ తోటకి అయినా సంవత్సరానికి ఒక్కసారే వసంతం వస్తుంది. కానీ ఈ తెలుగు పాటల పూలతోటకి నిత్యం వసంతమే! ఎందుకంటే ఈ పూల వనమాలి, యవ్వనమాలి వేటూరి సుందరరామమూర్తి కనుక. ఏ నదీమతల్లిని అయినా పన్నెండేళ్లకు ఒక్కసారే పుష్కర శోభ పలకరిస్తుంది. కానీ ఆంధ్ర దేశంలో ఆ మాటకొస్తే ఈ దేశంలో ప్రతి నది ప్రతినిత్యం పుష్కర శోభతో పరవళ్లు తొక్కుతుంది. ఎందుకంటే ప్రతి నదికీ ప్రతి నిత్యం తన పాటలతో పుష్కర శోభను అందించే పాటల పుష్కరుడు వేటూరి సుందర రామ్మూర్తి ఒకడు ఉన్నాడు కనుక"

ఈ మాటలు వేటూరి సుందర రామమూర్తిగారి జన్మదిన సందర్భంగా నా 'బ్లాగ్'లో రాసుకున్నవి. ఈ మాటల తడి ఆరకముందే పాటను అనాథ చేసి వేటూరి పాటల పల్లకిలో పరలోకానికి ప్రయాణం అయ్యాడు.

వేటూరి మరణవార్తను వినగానే, వెన్నెల రాత్రుల్లా, వేసవి మల్లెల్లా, వేటూరి పాటలు అజరామరం అనిపించింది. వేటూరి తెలుగు పాటకి పర్యాయ పదం. తెలుగు మాటకి అక్షయ పథం. "ఆరేసుకోబోయి పారేసుకున్నాను" అనే తుంటరి పాట రాసినా, "రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే" అంటూ గుండెల్లోని ఆవేదనని గద్గదికమయిన గొంతులో తాత్వీకరించినా, "చైత్రము కుసుమాంజలి, పంచమ స్వరమున ప్రౌఢ కోకిలలు పలికే మరందాల అమృతవర్షిణి" అంటూ ప్రకృతితో తాదాత్మ్యం చెందినా, "పండగంటి వెన్నెలంతా సెందరయ్యా దండగైపోతుంది సెందరయ్యా" అంటూ విరహోత్కంఠితలాగా విసుగు ప్రదర్శించినా, "కొబ్బరాకు గాలి మబ్బు కేసింది. ఉలికిపడ్డ మబ్బు ఉరిమి చూసింది" అంటూ బెంగపడినా, "అల్లో నేరేడు పళ్లు, అమ్మాయి కళ్లు గుచ్చే గులాబి ముళ్లు" అంటూ అల్లరి చేసినా, "జానకి కన్నుల జలధి తరంగం, రాముని మదిలో విరహ సముద్రం,

చేతులు కలిపిన సేతు బంధనం, ఆ సేతు హిమాచల ప్రేమ కీర్తనం సాగర సంగమమే, ప్రణయ సాగర సంగమమే” అంటూ సాంద్రమయిన ప్రేమ భావాలు మేను పులకరించేలా ప్రకటించినా ఒక్క వేటూరికే చెల్లింది. వేటూరి పాటకి పెట్టని కోట.

విజయవాడలో డిగ్రీ చదువుతున్నపుడే వేటూరికి కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి దగ్గర శిష్యరికం చేసే అవకాశమూ అదృష్టమూ కలిగింది. విశ్వనాథ మేరు నగ సమానమయిన పాండిత్య ప్రతిభ వేటూరిని మిక్కుటంగా ఆకర్షించింది. ఆయనలాగా తనూ రాయాలని తపించి, తపించి,

“సర్వానంద శర్వప్రియ
భ్రమర జన్మము నెత్తలేక ఇట భూ
భారంబుగా మానుష
క్రమముం బొందితి, కుందితిన్ పిదప

రెక్కలు లేని పక్షిని ప్రభూ” అనే పద్యం రాశారు. “విశ్వనాథ నా జీవిత పాఠశాల లోనూ పెద్ద గురువే” అంటూ వినమ్రంగా చెప్పుకునేవారు వేటూరి.

గ్రాడ్యుయేషన్ అయిన తరువాత మద్రాసులో ‘లా’ చదవడానికి వెళ్లిన వేటూరిలోని సాహిత్యాభినివేశాన్ని గమనించిన ముక్త్యాల రాజావారు ఆంధ్రప్రభ నార్ల వెంకటేశ్వరరావు గారి దగ్గరకు తీసుకెళ్లి పరిచయం చేశారు. అలా 1956లో ఆంధ్రప్రభలో జర్నలిస్టుగా చేరిన వేటూరి ఆంధ్ర సచిత్ర వారపత్రిక మీదుగా మళ్లీ ఆంధ్రప్రభకే చేరారు. ఆంధ్రప్రభలో ఆయన నిర్వహించిన “గుంటూరు కబుర్లు”, “అసెంబ్లీ గ్యాలరీ నుంచి” శీర్షికలకు ఎంతో రెస్పాన్స్ వచ్చింది. అప్పట్లో ద్వారకా హోటల్ దగ్గర గుమికూడే శాసనసభ్యులను ఉద్దేశించి ఆయన చేసిన “అదిగో ద్వారక, ఆలమందలివిగో” అనే వ్యాఖ్య పెద్ద దుమారమే రేపింది. శాసనసభలో సభాహక్కుల ఉల్లంఘన దాకా వెళ్లిందట. చివరకు బి.వి.సుబ్బారెడ్డి గారి జోక్యంతో సద్దుమణిగింది.

ప్రముఖ పారిశ్రామికవేత్త వి.బి.రాజు దగ్గర్నుండి “ఆంధ్ర జనత”ను పెద్దరెడ్డి తిమ్మారెడ్డి కొని పార్టీ పత్రికగా నడపాలని కోరుకున్నపుడు సంపాదకుడిగా ఆయనకు తోచిన మొదటి పేరు వేటూరిదే!

1967లో ఆంధ్ర జనత సంపాదకుడిగా వేటూరి సుందర రామ్మూర్తి ఉగాదికి 60 పేజీల స్పెషల్ ఎడిషన్ రాసి సంచలనం సృష్టించారు. ఆ తరువాత అదే ఒరవడిలో ఆంధ్ర పత్రిక ‘ఉగాది’కి ప్రత్యేక సంచికలు యివ్వడం అది మూతపడే వరకు కొనసాగించింది. దినపత్రికలు రాజకీయాలకే పరిమితం కాకుండా జీవితంలోని అనేక పరాన్ముఖ కోణాలకి ప్రాధాన్యం యివ్వడం మొదటిసారిగా వేటూరి పెట్టిన ఒరవడే!

# కేరక్టరైజేషన్ లేదా పాత్ర చిత్రణ

"జీవితం కొందరి పట్ల పరమ దయాపూరితంగా వుంటుంది. మరికొందరిని అకారణంగా ఆగ్రహిస్తుంది" అంటాడు దయానిధి చివరకు మిగిలేది నవలలో. జీవితమే కాదు, జీవితానికి మినీయేచర్ లాంటి సినిమా కూడా అంతే. ఏమీలేని కొన్ని సినిమాలు వందలాది రోజులు, సంవత్సరాల తరబడి నడుస్తూ వుంటాయి. మరికొన్ని మంచి సినిమాలు కేవలం మార్నింగ్‌షోలకే పరిమితమవుతాయి. ఏ సినిమా ఎందుకు విజయవంతం అవుతుందో, ఏ సినిమా ఎందుకు అపజయాన్ని మూటగట్టుకుందో ఎవరికి మాత్రం తెలుసు?

మనిషి మనసులో చేతన, అంతఃచేతన, సుప్తచేతన (ఇడ్, ఇగో, సూపర్ ఇగో) వున్నట్లుగానే సినిమాకూ మూడు ముఖ్యమయిన భాగాలుంటాయి. అవి 1. బాహ్యరూపం 2. అంతర్రూపం 3. ఈ రెండింటిని సమన్వయం పరిచే సమన్వయ రూపం. బాహ్య రూపమంటే నటీనటులు, వారి పెర్ఫార్మెన్స్. అది సృష్టించే సినిమా వాతావరణం లాంటి బాహ్యమయిన అంశాలు. అంతర్రూపం అంటే కథ, మాటలు, పాటలు, సంగీతం లాంటివి. ఈ రెండింటినీ సమన్వయపరిచే సమన్వయ రూపం పేరే స్క్రీన్‌ప్లే. లేదూ చిత్ర రచన. ఒక భావం రచయిత మనసులో రూపుదిద్దుకుని, అచ్చుగుద్దినట్లుగా యధాతథంగా ప్రేక్షకుడి మానసిక ఆవరణలోకి దూసుకెళ్లే క్రమంలో జరిగే తతంగం అంతా సినిమా యజ్ఞం. యజ్ఞఫలం సక్రమంగా, సరిగా అందాలంటే మూడింటి సమన్వయం ఎంతో ముఖ్యం. అందుకే చిత్రం శరీరం అయితే, స్క్రీన్‌ప్లే దాని ఆత్మ.

హాలీవుడ్‌లో లాగా టాలీవుడ్‌లో స్క్రీన్‌ప్లే ఒక శాఖగా పూర్తిగా ఎదగలేదు. దర్శకులే స్క్రీన్‌ప్లే రాసుకోవడం మనకు యిప్పటివరకూ వున్న అలవాటు. నిజానికి స్క్రీన్‌ప్లే అనేది మామూలు విషయం కాదు. ఎ4 పేజీని మధ్య అరను నిలువుగా మడిచి సన్నివేశ వివరం, సెట్ ప్రాపర్టీలు రాసుకోవడం మాత్రమే స్క్రీన్‌ప్లే కాదు. చిన్నచిన్న ఫ్రేమ్‌లన్ని కొన్ని



షాట్లై ఆ షాట్ల సమాహారమే సినిమా అయి ప్రేక్షకుడిని సంభ్రమాశ్చర్య చకితులను చేస్తుంది. సినిమాలో షాట్ డివిజన్ ఎంత అద్భుతంగా వుంటే, ఒక షాట్‌లో ఫ్రేమ్‌లు ఎంత పొయెటిక్‌గా వుంటే సినిమా అంత అద్భుతంగానూ, అందంగానూ వస్తుంది.

లాంగ్‌షాట్, మీడియం లాంగ్‌షాట్, మీడియం క్లోజ్ అప్, లాంగ్ క్లోజ్ అప్ లాంటి సినిమా గ్రామర్ విషయాలు రెండు మూడు తెలిస్తే చాలు కుర్రాళ్లు అందరూ మెగాఫోన్ చేతపడుతున్నపుడు, స్క్రీన్‌ప్లే అనేది కేవలం అధ్యయనం చేస్తే మాత్రమే వచ్చే అంశం కాదు. దానికి నిరంతరాభ్యాసనం కావాలి అని చెప్పాల్సిందే!

దర్శకుడికి స్క్రీన్‌ప్లే పట్ల సమగ్రమయిన అవగాహన, టార్గెటెడ్ ప్రేక్షకుల పట్ల అంచనా, సినిమాకు ఎంతయినా అవసరం. నిజానికి "A Film is mould by an individual not by a comittee" అంటాడు ప్రఖ్యాత హాలీవుడ్ డైరెక్టర్ ఫ్రాంక్ కాప్రా. సినిమా నిర్మాణానికి సంబంధించి అన్ని విషయాలలోను అంతిమ నిర్ణయం తీసుకునే వ్యక్తి డైరెక్టరో, ప్రొడ్యూసరో ఎవరో ఒకరే వుండాలని ఫ్రాంక్ కాప్రా అభిప్రాయం.

రాజమకుటం సినిమా తీసే సమయంలో రచయిత డి.వి.నరస రాజుగారు తీసిన ఒక సన్నివేశాన్ని దర్శకుడు బి.ఎన్. ఎలా మార్పులు చేశారో, చివరకు ఆ సన్నివేశం ఎలా తయారయిందో తెలుసుకుంటే, ఫ్రాంక్ కాప్రా అభిప్రాయం ఎంత సత్యమో మనకు అర్థం అవుతుంది.

“రాజకుమారుడు ఆవేశంతో ఊగిపోతూ రాజభవనం వైపు విసురుగా నడిచి వెళ్లి... రాజభవనం వరండాల గుండా, నాలుగైదు మలుపులు తిరిగే దారుల గుండా వెళతాడని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో టెన్షన్ బిల్డప్ చెయ్యాలనీ, చివరకు రాజకుమారుడు తన చాంబర్‌లోకి వెళ్లి గోడమీద వున్న కోట్ ఆఫ్ ఆర్మ్‌డ్ నుంచి కత్తిని లాగుతాడని అప్పుడు అతని తల్లి వచ్చి అతన్ని వారిస్తుందని” నరసరాజుగారు స్క్రిప్ట్ రాసారు.

షూటింగ్ స్క్రిప్ట్ రాసేటప్పుడు బి.ఎన్. డిక్టేట్ చేసిన షాట్స్ చూడండి. తన పినతండ్రి హంతకుడని కత్తి విసిరిన మనిషి చెప్పగానే బి.ఎన్. చెప్పిన షాట్స్....

# పదేళ్ల తెలుగు సినిమా వెలుగునీడలు

ఇరవై ఒకటవ శతాబ్దంలో మరొక దశాబ్దం మొదలయింది. 2001 నుండి 2010 వరకు విస్తరించుకున్న ఈ దశాబ్దం తెలుగు సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన సంక్షుభిత దశాబ్దమే. జాగృతమయిన ప్రజలు చేస్తున్న అస్తిత్వ ఉద్యమాలు, ఆర్థిక సామ్రాజ్యవాదానికీ, ప్రపంచీకరణ ముసుగులో కొనసాగుతున్న ఆర్థిక సంస్కరణలకీ పుట్టిన వికృత వికలాంగ శిశువు సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు, ఏకత్వం నుండి బహుళత్వంలోకి మెల్లమెల్లగా జారుకుంటున్న తెలుగువాడి మానసిక ప్రపంచాలు ఈ దశాబ్దాన్ని గుర్తుంచుకోదగిన దశాబ్దంగా మలిచాయి.

ఒక కళారూపంగా తెలుగు సినిమా ఈ సంక్షుభిత సందర్భాన్ని ప్రతిభావంతంగా ప్రతిఫలించిందా...? వేగంగా దూసుకుని వస్తున్న మార్పు గతిని వేగవంతం చేయడమో, ఆ గమనాన్నీ, గమ్యాన్నీ నిర్ధారించే ప్రయత్నం చేయడమో జరిగిందా అన్న ప్రశ్న వేసుకుంటే మాత్రం జవాబు నిరాశనే మిగులుస్తుంది.

తెలుగువాడి జీవితంలోకి అతడి ప్రమేయం లేకుండా, వచ్చి పడిన ఒక అనివార్య మయిన మార్పును, అతడి మానసిక ప్రపంచంలో అలజడిని, ఏమయినా తెలుగు సినిమా పట్టుకోగలిగిందా? ఆ మానసిక సంఘర్షణని వెండితెర మీద ఆవిష్కరించ గలిగిందా? అన్న ప్రశ్న వేసుకుంటే జవాబు మాత్రం ఒక పెద్ద సున్నా!

జనవరి 11 2001న విడుదల అయిన "నరసింహనాయుడు" మొదలుకొని డిసెంబర్ 31, 2010న విడుదల అయిన 'బ్రోకర్' వరకు, డైరెక్ట్, డబ్బింగ్ సినిమాలు మొత్తం కలుపుకుంటే 1606 సినిమాలు విడుదల అయ్యాయి. 2005 సంవత్సరంలో అత్యధికంగా 239 సినిమాలు విడుదల అయితే 2007లో అత్యల్పంగా 98 సినిమాలు విడుదల అయ్యాయి. సగటున సంవత్సరానికి 160 సినిమాలు విడుదల అయ్యాయి.

2002లో (జూలై 25/2002) విడుదల అయిన 'ఇంద్ర' రూ. ముప్పైకోట్ల

రూపాయలు వసూలు చేస్తే 2009 (జూలై 31/2009)లో విడుదల అయిన మగధీర రూ. 60 కోట్లు వసూలు చేసింది.

ఏడేళ్ల కాలంలో తెలుగు సినిమా స్టామినా రెట్టింపు అయింది. అదే సమయంలో తెలుగు సినిమా నిర్మాణ వ్యయం కూడా ఆకాశాన్ని అంటింది. 'మగధీర' నిర్మాణానికి 40 కోట్లు ఖర్చు జరిగితే 'ఆరెంజ్' నిర్మాణానికి రమారమి 30 కోట్లు ఖర్చయిందట. తెలుగునాట రికార్డుల మీద రికార్డులు సృష్టించిన ప్రేమకథ 'ప్రేమాభిషేకానికి' 35 లక్షల లోపే ఖర్చయితే, ఓ రేంజ్ ప్రేమకథ 'ఆరెంజ్'కి 30 కోట్లు ఖర్చు. ఒక అందమయిన ప్రేమకథను దృశ్యకావ్యంగా మల్చడానికి ఇంత ఖర్చు అవసరమా...?

ఈ పదేళ్లలో ఎస్.ఎస్.రాజమౌళి, శేఖర్ కమ్ముల, క్రిష్, చంద్రసిద్ధార్థ లాంటి దర్శకులు వెండితెరకు పరిచయమయ్యారు. లారెన్స్, ప్రభుదేవాలాంటి నృత్య దర్శకులు మెగాఫోన్ చేత పట్టుకున్నారు. ఫిలిమ్ మేకింగ్‌లోనూ, కథల ఎంపికలోనూ ఈ కొత్త దర్శకులు పాత దర్శకుల కంటే విభిన్నమయిన పంథాను అవలంబించారు. 'ఆనంద్', 'గోదావరి', 'హేపీడేస్', 'లీడర్'లాంటి కథలు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సినిమాలుగా రూపొందాయి. శేఖర్ కమ్ములలాగే యివన్నీ "ప్లెయిన్ స్పీకింగ్" సినిమాలు. ఈ చిత్రాలన్నీ ఎక్కడా ఒడిదుడుకులు లేకుండా అలా గోదావరి ప్రవాహంలాగా కొనసాగుతాయి. శేఖర్ కమ్ముల సినిమాలలోని ప్రత్యేకత ఏంటంటే, ఒక్క నెగెటివ్ పాత్ర కూడా మనకు కనిపించదు. ప్రతికూల పరిస్థితులలో మానవ ప్రవర్తన మాత్రమే కనిపిస్తుంది. కొద్దోగొప్పో అంతరంగ సంఘర్షణ ఇతడి సినిమాలలో కనిపిస్తుంది.

తీసినవి రెండు సినిమాలే అయినా ప్రేక్షకులలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నవాడు క్రిష్. 'గమ్యం', 'వేదం' ఆ రెండు సినిమాలు కథారచనలో ఎన్ని ప్రయోగాలు చేయవచ్చో, సినిమా రచనలోనూ అన్ని ప్రయోగాలు చేయవచ్చని యితడు నమ్మినట్లున్నాడు. 'గమ్యానికి, 'వేదానికి' అస్సలు పోలికే లేదు. గతం, వర్తమానం, గతం పద్ధతిలో 'గమ్యం' కొనసాగితే, వేదం యిందుకు పూర్తి విరుద్ధం. గ్రహణంతో యింద్రగంటి మోహనకృష్ణ, ఆ నలుగురుతో చంద్ర సిద్ధార్థ ప్రేక్షకుల మీద చెరగని ముద్ర వేశారు.

"నువ్వొస్తానంటే నేనొద్దంటానా?" అనే బ్లాక్‌బస్టర్‌తో దర్శకుడిగా పరిచయ మయిన ప్రభుదేవా 'పౌర్ణమి'లాంటి డిజాస్టర్ అందించినా, 'స్టైల్' తో పరిచయ మయిన లారెన్స్ 'మౌని'లాంటి చెత్త అందించినా దర్శకులుగా విభిన్నతను చాటుకోవడానికి ప్రయత్నించిన వారే.

ఇందుకు ప్రతిగా లబ్దప్రతిష్టులయిన దర్శకులు తమ పాత పంథాలోనే సినిమాలు నిర్మిస్తూ విజయాలకు దూరంగా వున్నారు.

# ఈ పాటలకి అర్థం చెప్పండి ప్లీజ్

"కవిత్వం అంటే మాటల కూర్పు కాదు. అదొక మెరుపు" అంటాడు ఖలీల్ జిబ్రాన్. నిజమే! మెరుపు కవి ఎన్నుకునే విషయంలో వుండాలి. కవిత్వ శైలిలో, శిల్పంలో వుండాలి. కవిత ద్వారా పాఠకుడికి అందించే అనుభూతిలోనూ, అనుభవంలోనూ మెరుపు వుండాలి. ఆ మెరుపు లేకపోతే అది అకవితో, కుకవితో అవుతుంది తప్పితే సుకవిత మాత్రం కాదు. కవిత్వంలాగే పాట కూడా!

పాటకి పల్లవి ప్రాణం అయితే, పరిమళం చైతన్యం. చైతన్యాన్ని అందించని పాట పాటేకాదు. మనసంతా దిగులు మేఘాలు కమ్ముకుని గుబులు రేకెత్తిస్తున్నప్పుడు ఒక పాట సాంత్వన పరుస్తుంది. మనసంతా ఉత్సాహం నిండుకుని, ఉల్లాసంగా వున్నపుడు ఒక పాట ఆ సంతోష సమయాన్ని మరింత సాంద్రతరం చేస్తుంది. జీవితంలోని ప్రతి అంశానికీ పాట చేదోడు, వాదోడు.

"మాకొద్దీ తెల్లదొరతనం! దేవా మా కొద్దీ తెల్లదొరతనం" అన్న గరిమెళ్ల సత్యనారాయణ పాట తెలుగు నాట స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని యిచ్చింది. విప్లవానికి ఎక్కడయినా సరే! పొత్తిళ్లలో పురుడుపోసే మంత్రసాని ఎవరంటే కచ్చితంగా పాటే! పాట ప్రభుత్వాలని కూల్చగలదు. ప్రభుత్వాలని నిలుపనూ కలదు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఉద్విగ్న హృదయానికి ప్రాణం పోయనూ గలదు.

తెలుగు సినిమాల విషయానికి వస్తే పాటల్లేని సినిమాను ఊహించను కూడా ఊహించలేం! "పుష్పక విమానం"లాంటి సినిమాలు ఒకటి రెండు వచ్చినా అవేవీ ఒక ధోరణిగా నిలబడలేకపోయాయి. కేవలం ప్రయోగంగా మాత్రమే మిగిలాయి.

ఉత్తమ కవిత్వం, అత్యుత్తమ సంగీతం కలగలిసి, శ్రోతల మనోధర్మ సంసారాన్ని వెలిగించిన పాట, ఆకాశంబు నుండి, శంభుని శిరంబు నుండి అన్నట్లుగా పాతాళానికి దిగజారిన వైనం తల్చుకుంటే కొంత దుఃఖమూ, మరికొంత వేదనా కలగలసి గుండె మెలిపెడతాయి. పింగళి నాగేంద్రరావు గారి చమత్కారం, మల్లాది రామకృష్ణశాస్త్రిగారి మార్మికత, శ్రీశ్రీ విప్లవం, దాశరథి, సినారెల ఉర్దూ పారశీక భాషల సంప్రదాయ పరిమళం,

 

కొసరాజు జ్ఞానపథం జానపదం, ఆత్రేయ హృదయస్పందన, వేటూరి వైవిధ్యం, సిరివెన్నెల మాటల మంత్రజాలం కలిసి తెలుగు సినిమా పాటకి ప్రేక్షకుల, శ్రోతల హృదయాలలో అత్యున్నత స్థాయిని చేకూర్చాయి.

వీళ్లంతా పాటలలో రకరకాల ప్రయోగాలు చేశారు. అల్లరి, ఆకతాయి తనం, విషాదం, విప్లవం, విరహం, ప్రేమ, వాత్సల్యం, నిందాస్తుతి ఏది రాసినా పాట ఆత్మ దెబ్బతినకుండా చూశారు. ఆ పాటకి జవసత్వాలని యిచ్చి ప్రాణం పోశారు. అందుకే యివ్వాళ్టికీ, గుర్రం జాషువా, "సుకవి జీవించు ప్రజల నాల్కలపై" అని చెప్పినట్లుగా వాళ్ల పాటలు ప్రజల నాల్కలపై నడయాడుతున్నాయి.

ఇవ్వాళ పాటకి అన్నీ వున్నాయి. రక్తం, మాంసం, పదం, అలంకారం అన్నీ వున్నాయి. కానీ వుండాల్సిన అతి ముఖ్యమైన ప్రాణం లేదు. ఆత్మలేదు. ఒక పల్లవి, రెండు చరణాలు రాసేస్తే పాట కాదు. పాట మొత్తంగా ఒక భావాన్ని చెప్పాలి. ఒక అనుభవ రహస్యాన్ని విప్పాలి. సాంద్రతర అనుభూతిని అందించాలి. చిరునవ్వు వెన్నెలలు కురిపించాలి. హర్షోద్విగ్న అంతరంగానికి ఆనంద కాననం చూపించాలి. దుఃఖంతో, వేదనతో బండబారిన హృదయాలకి, నిండు గ్రీష్మంలో శీతల పవనంలాగా సాంత్వన చేకూర్చాలి. మనిషిని అనేకానేక తన్యతల నుండి విముక్తిడిని చేయాలి. ఇవేవీ చేయకపోతే, పాట పాట కానేకాదు.

గానయోగ్యత మాత్రమే పాట లక్షణం కాదు. ఎస్.రాజేశ్వరరావుగారి లాంటి మహనీయుడయిన సంగీత దర్శకుడు వుంటే, దినపత్రికల పతాక శీర్షికలు కూడా అందమయిన పాటలుగా మారతాయి. కానీ పతాక శీర్షికలు ఎప్పటికీ పాటలు కాలేవు కదా! అందుకే పాట ఒక ఆల్కెమీ...! అదొక రస విద్య.

# తెలుగు స్త్రీ సినిమా ఎప్పుడు?

'శ్రీరామరాజ్యం' సినిమా చూసి బయటకు వచ్చిన తరువాత ఒక మిత్రుడు "సీత పాత్రధారిణి నయనతారను చూస్తే నయనతారను చూసినట్లే వుంది కానీ సీతా మహాసాధ్విని చూసినప్పుడు కలిగే భక్తి భావం కలగలేదు" అన్నాడు. "సీత పాత్రలో నయనతార గొప్పగా అభినయించి వుండవచ్చు కానీ నాకు మాత్రం సీతకు మారుగా నయనతారే కన్పించింది" అంటూ ముక్తాయించాడు.

సవాలక్ష సినిమాలలో ఏ ప్రాధాన్యతాలేని, ఏ వ్యక్తిత్వమూ లేని దేహ ప్రదర్శనలను, ప్రేక్షకుల ముందుంచిన అనేకానేక మాంసఖండాలను హీరోయిన్ల రూపంలో ప్రేక్షకుడికి చూడటం అలవాటు అయినాక, పాత్రకి బదులు పాత్రధారిణి కనపడితే, విస్మయం చెందవలసిన అవసరం కానీ, బాధపడవలసిన సందర్భంకానీ కాదేమో!

తెలుగు సినిమాలలో కథానాయికల ప్రాధాన్యత కుంచించుకుని పోయి చాలాకాలమే అయింది. పురుషాధిక్య చిత్ర పరిశ్రమలో కథానాయిక తన భుజస్కంధాల మీద నిలిపి సినిమాను విజయవంతం చేసినప్పుడు కూడా హీరోలకు పేరు వచ్చింది. స్టార్‌డమ్ పెరిగింది. కానీ హీరోయిన్లకి ఒరిగింది ఏమీలేదు.

ప్రపంచీకరణ దశాబ్దంలో... ఆ తదనంతర కాలంలోనూ, సినిమా ప్రథమ ప్రాధాన్యం డబ్బు సంపాదనగానే మారాక, ఎన్ని విలువలు దిగజారిపోయినా సరే, మనం నిద్ర నటించే స్థితికి చేరుకున్నాం. కనుక ఈ దుస్థితికి మనం మనలని తప్పిస్తే మరెవరినీ నిందించలేము.

చలన చిత్రసీమలో మొదటి నుండీ స్త్రీల పట్ల వివక్ష ప్రబలంగానే వుంది. అన్ని రంగాలలోనూ పురుషులదే పైచేయి. 'నటన' అనే పదంలోని అక్షరాలు తెలియకపోయినా సరే అతడు ఉత్తమ నటుడే. ఎంత అద్భుతంగా నటించినా స్త్రీలు మాత్రం రెండవ తరగతి పౌరులే.



నిజానికి చిత్రసీమ స్త్రీలకు ఎప్పుడూ ఒక అంపశయ్యే! వాళ్లకు అది ఎప్పుడూ ఒక మరణ శాసనాన్నే లభిస్తున్నది. మరణశాసనాన్నే ప్రేమలేఖగా భ్రమింపజేస్తున్నది.

ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకు అనుకుంటున్నారా? మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సినిమాలలో స్త్రీల భాగస్వామ్యం గురించి ఆలోచించి నప్పుడు నాకు కలిగిన వేదనని మీతో పంచుకోవడానికి.

భౌతికంగానేకాక, చిత్రీకరణలో కూడా స్త్రీలకు దక్కవలసిన నిజమయిన వాటా వాళ్లకు దక్కనేలేదు. తొలినాటి కథారచయితలు, నిర్మాతలో దర్శకులు, సృజనశీలురు అందరూ చిత్రాలలో స్త్రీలను తల్లులుగా, ప్రియురాళ్లుగా, యింకాస్త ముందుకువెళ్ళి ఆడబొమ్మలుగా చిత్రించారు తప్పిస్తే సొంత వ్యక్తిత్వమున్న మహిళగా, సమాజ అభ్యుదయ పథంలో పురుషుడిలో సమానమయిన భాగస్వామిగా చిత్రించనేలేదు. అత్తలుగా, అమ్మోరులుగా, అమ్మాయి కాపురాలుగా తెలుగు సినిమా కథానాయిక వెలిగిపోయింది. సహజ సౌకుమార్యం చాటున సంకల్ప బలాన్ని చూపించే సినిమాలు అరుదు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ స్పృజించని స్త్రీల సంబంధమయిన అంశాలు ఎన్నో వున్నాయి. వాటినెవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. అందువలన అనేకానేక రంగాలలో స్త్రీల భాగస్వామ్యం గురించి అంచనా సినిమా పరంగా జరగనేలేదు. నేటి చరిత్రను పునర్లిఖించడానికి రేపు అవసరమయిన సాధనాలలో సినిమా కూడా ఒకటి కదా...! ఈ మాట ఎందుకు అంటున్నాను అంటే... “1930వ దశకంలో సుబ్రహ్మణ్యం అనే దర్శకుడు

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/25th+Frame+Subham+Taruvata](http://kinige.com/book/25th+Frame+Subham+Taruvata)**

* * *